సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

యోగా సాధనతో ఆరోగ్యం



మెలకవులు నేర్పుతున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

మల్కాపురం: యోగా సాధనతో మానసిక ఒత్తిడిని జయించవచ్చునని బ్రహ్మకుమారి సంస్థ (శ్రీహరిపురం) ఇన్‌చార్జి సింధూ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా శ్రీహరిపురంలో యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న సభ్యులందరికీ యోగాలో మెలకవులను ఆమె నేర్పించారు. నిత్యం యోగా,నచ్చిన దైవాన్ని ప్రార్థిస్తే మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుందన్నారు. తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో యోగా గురువు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అంధకారం



చీకట్లో రోగి

మల్కాపురం: స్థానిక సెయింట్ ఆన్స్ ఆస్పత్రిలో సోమవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిచింది. సుమారు గంటన్నర వరకు విద్యుత్ సరఫరా రాలేదు. ఆ సమయంలో ఆస్పత్రి యాజమాన్యం జనరేటర్ ఆన్ చేయలేదు. దీంతో రోగులు అంధకారంలో అవస్థలు పడ్డారు. చివరకు కొంత మంది రోగుల బంధువులు జనరేటర్ సదుపాయంపై సిబ్బందిని ప్రశ్నించడంతో వారు ఆన్ చేశారు.

ఘనంగా అమ్మవారి తొలేళ్లు



అమ్మవారిని ఊరేగిస్తున్న నిర్వాహకులు

కూర్మన్నపాలెం: రథాలమ్మతల్లి పండగను పురస్కరించుకొని వడ్లపూడి కణితి కాలనీలో సోమవారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో అమ్మవారిని ఊరేగించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. రామాలయం నుంచి అమ్మవారి ఘటాలను వడ్లపూడి పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవం ముందురోజు కావడంతో తెల్లవార్లు ఘటాలు మోసిన భక్తులు ఉపవాసాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా అమ్మవారి సిరిమాను ఉత్సవం మంగళవారం అత్యత వైభవంగా నిర్వహించనున్నారు. కణితి రామాలయం వద్ద సిరిమాను ప్రారంభమై మెయిన్‌రోడ్డు , చాకలి వీధి మీదుగా రథాలమ్మ ఆలయానికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

మత్తుకు బానిస కావద్దు

సీతంపేట: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా 'మత్తు వద్దు , బంగారు భవిష్యత్తే ముద్దు'అనే నినాదంతో బాలవికాస్ ఫౌండేషన్ రూపొందించిన గోడపత్రికను అక్కయ్యపాలెంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) కార్యాలయంలో సంస్థ డైరెక్టర్ ఈదర రవికిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం మత్తుకు బానిస కావొద్దంటూ బాలవికాస్ ఫౌండేషన్ విస్తృత ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిత్యం గమనించాలని, వాళ్లకు అభిరుచి ఉన్న రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. బాలవికాస్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఈనెల 26న కళాశాలల్లో మాదకద్రవ్యాలపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అండ్ కస్టమ్స్ అదనపు కమిషనర్ కాకరాల ప్రశాంత్, నాసిన్ సహాయ డైరెక్టర్ కె.ఆర్.ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం

ధ్రువపత్రాల జారీలో జాప్యం!

• విద్యార్థులకు తప్పని నిరీక్షణ • తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు • ప్రొటోకాల్ విధులతో అధికారుల సతమతం • ఇదీ గోపాలపట్నం మండలంలో పరిస్థితి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయంలో సకాలంలో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయానికి ప్రతిరోజు పదుల సంఖ్యలో విద్యార్థులు వస్తున్నారు. సకాలంలో తమకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని అధికారులను వేడుకుంటున్నారు.

ప్రొటోకాల్ విధులతో సతమతం

జిల్లాలో మిగతా మండల అధికారుల కంటే గోపాలపట్నం మండల రెవెన్యూ అధికారులకు తీవ్రమైన పని ఒత్తిడి ఉంటోంది. మండల పరిధిలోఎయిర్ పోర్టు ఉండడంతో ఇక్కడి రెవెన్యూ అధికారులు నిత్యం ప్రొటోకాల్ విధులతో సతమతం అవుతున్నారు. నగరానికి వచ్చే వీఐపీలకు ఆహ్వానం పలికేందుకు ఎయిర్ పోర్టులోనే గంటల తరబడి అధికారులు ఉండిపోతున్నారు. ఈ కారణంగా కార్యాలయంలో అధికారులు, సిబ్బంది అందుబాటు లేక పనులు సకాలంలో కావడం లేదని ఇక్కడి ప్రజానీకం అంటున్నారు. గతంలో సచివాలయంలో దరఖాస్తు చేస్తే సకాలంలో ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యేవని.. ప్రస్తుతం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని దరఖాస్తు దారులు వాపోతున్నారు.

పేరుకుపోయిన ఫైళ్లు

విశాఖలో జరిగిన యోగా డే సందర్భంగా వారం రోజులు పాటు గోపాలపట్నం మండల రెవెన్యూ అధికారులు కంటిమీద కునుకు లేకుండా వీఐపీల సేవలో తరించాల్సి వచ్చింది. అందుకే ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించిన ఫైళ్లు పేరుకుపోయినట్లు చెబుతున్నారు. ప్రొటోకాల్ విధుల సమయంలో కార్యాలయంలో పనులకు ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజానీకం కోరుతున్నారు.

మాటేస్తున్న దళారులు

తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగుతుండడాన్ని దళారులు అదునుగా తీసుకుంటున్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వారి చెంత చేరి తాము పనులు చేయిస్తాం అంటూ డబ్బులు వసూలు చేస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. ఇలాంటి పైరవీకారులకు కార్యాలయంలో పనిచేసే కొంతమంది దిగువ స్థాయి సిబ్బంది సహకరిస్తున్నట్లుగా ప్రచారం ఉంది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేలా తహసీల్దార్ ప్రత్యేక దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

మాధవధారకు చెందిన ఓ విద్యార్థిని కుల ధ్రువీకరణ పత్రం కోసం మీసేవ ద్వారా ఈ నెల 5న దరఖాస్తు చేసుకుంది. రిజర్వేషన్ కోటాలో విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సీటు వచ్చింది. కౌన్సిలింగ్‌కు హాజరైన ఆ విద్యార్థినికి తాజాగా జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని అధికారులు సూచించారు. గతంలో పొందిన కుల ధ్రువీకరణ పత్రం ఉందని, తాజాగా దరఖాస్తు చేసినట్టు రసీదు చూపించినా కుదరదని కౌన్సెలింగ్‌లో అధికారులు చెప్పారు. చేసేది లేక సోమవారం తన తల్లిని వెంటబెట్టుకుని గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చింది. కుల ధ్రువీకరణ పత్రం సకాలంలో జారీ కాకపోవడం వల్ల తాను సీటు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఇలా అనేక మంది విద్యార్థులు తమకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

\- విశాఖ విద్య



దరఖాస్తులను సిద్ధం చేస్తున్న సిబ్బంది



ఆర్‌ఐ చాంబర్ చుట్టూ చేరిన దరఖాస్తుదారులు

కనక మహాలక్ష్మి సేవలు చిరస్మరణీయం



రాయపురెడ్డి కనకమహాలక్ష్మికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుడివాడ, పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్‌కుమార్ భార్య రాయపురెడ్డి కనక మహాలక్ష్మి ఇటీవల మృతి చెందారు. 60వ వార్డు మాజీ సైనిక కాలనీలో అంబేడ్కర్ మైదానంలో సోమవారం సంతాపసభ నిర్వహించారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణకుమారి, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు మెంబర్ శ్రీదేవి వర్మ తదితరులు కనక మహాలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.వారు మాట్లాడుతూ కనకమహాలక్ష్మి 60వ వార్డు పార్టీ మహిళా నాయకురాలిగా ఎనలేని సేవలు అందించారని కీర్తించారు.

సారకం మహేష్‌పై పీడీ యాక్ట్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌కు చెందిన సారకం మహేష్‌పై పోలీస్ కమిషనర్ పీడీ యాక్ట్ నమోదు చేశారు. నిత్యం గంజాయి, మాదక ద్రవ్యాలు, సైకోట్రోపిక్ వంటివి అక్రమ రవాణా చేయడం చేసేవాడు. అతనిలో మార్పు రాక పోవడంతో పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

యువత పోరుకు తరలిన నాయకులు



రాలీలో పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్, నాయకులు, కార్యకర్తలు



89వ వార్డు నుంచి యువత పోరుకు బయలుదేరిన యువకులు

గోపాలపట్నం: యువతకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం దగా చేయడంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుంచి యువత పోటెత్తింది. పార్టీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతోపాటు నిరుద్యోగ యువత, యువకులు అధిక సంఖ్యలో కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించకపోవడం, భృతి ఇవ్వకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ సురేష్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు లంక కార్తీక్, నాయకులు దేవరకొండ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


యువత పోరుకు రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో యువకులు భారీగా వెళ్లి నిరసన గళం వినిపించారు. నిరుద్యోగులకు ఏడాది బకాయి ఉన్న భృతి తక్షణమే చెల్లించాలని వారంతా డిమాండ్ చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జోనల్ డైరెక్టర్ పంకజ్, హెచ్‌ఎం స్వర్ణలత





ఆలోచింపజేసిన చిత్రాలు

గోపాలపట్నం: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందామని నార్కొటిక్ కంట్రోల్ బ్యూరో జోనల్ డైరెక్టర్ పంకజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు పలు రూపాల్లో అలవాటు చేసేందుకు విద్రోహ శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. చాక్లెట్లు వంటివి ఎవరైనా ఇస్తే తీసుకోవద్దని సూచించారు. గ్రీన్ వేలీ ఫౌండేషన్ ప్రతినిధి ఉమారాజ్ పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు వంటి అంశాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. విద్యార్థులు వేసిన చిత్రాలు ఆలోచింపజేశాయని హెచ్‌ఎం స్వర్ణలత కొనియాడారు. అనంతరం విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



మళ్ల విజయప్రసాద్‌తో 58వ వార్డు నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డుకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఆ పార్టీ పశ్చిమ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.వార్డులో పార్టీ పరిస్థితి, ప్రజా సమస్యలపై చర్చించారు.మళ్ల విజయప్రసాద్‌ను కలిసిన వారిలో ఇటీవల పార్టీ పదవులు పొందిన నాయకులు గొందేశి సత్యనారాయణరెడ్డి (గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి),పిలక రమణ (వైఎస్సార్‌టీయూ కార్యదర్శి), సీహెచ్.ముకుంద (జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి),గొందేశి గోవిందరెడ్డి((జిల్లా వలంటీర్స్ కార్యదర్శి),సీహెచ్.రామారావు (జిల్లా బీసీ సెల్) నాయకులతో పాటు పార్టీ వార్డు సీనియర్ నాయకుడు గులిగిందల కృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండే వినతులు



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి తారా ప్రసన్నరెడ్డి

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం కార్యా లయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండే వినతులు అందాయి. జోనల్ కమిషనర్ సెలవు లో ఉండడంతో ఇన్‌చార్జి ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి వినతులు స్వీకరించి వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ దిలీప్ కుమార్, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, సూపరింటెండెంట్లు రాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో మెరిసిన విద్యార్థులు



హర్ష వర్ధన్‌నాయుడు



యల్లపు సంతోషి లక్ష్మి



హర్షవర్ధిని

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూల్ విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. గోపాలపట్నం బాలుర హైస్కూల్‌లో 590 అత్యధిక మార్కులు సాధించిన పి. హర్షవర్ధన్ నాయుడు, ఎం.సత్యపూజిత, బి.హేమంతిని, కె.హరిణిజయశ్రీ, ఎంపికయ్యారని తెలిపారు. బాలికల హైస్కూల్లో 7 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎక్కువ శాతం మందికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని హెచ్‌ఎం స్వర్ణలత తెలిపారు. గ్రీష్మశ్రీ వై. సంతోషి లక్ష్మి, బి. గీతిక, పెంటకోట సుష్మిత, వి. హర్ష వర్ధిని, యల్లపు జాహ్నవి, కె. ధనుశ్రీ, ఎంపికయ్యారు. ఒక పాఠశాల నుంచి ఇంత మంది ఎంపికవడం చాలా సంతోషాన్నిచ్చిందని తెలిపారు. విద్యార్థులందరిని అభినందించారు. ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

జోరు వాన

సేవా మార్గాల్లో నిలిచిన వర్షపు నీరు



ఆర్‌కేపురం సేవా మార్గంపై నిలిచిన వర్షపు నీరు



నేవల్ ఏరియాలో నిలిచిన వర్షపు నీరు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం జోరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు అధిక వర్షం,మరలా తేలిక పాటి జల్లులు పడ్డాయి. వర్షానికి నేవల్ ఏరియా,ఐఎంయూ,ఆర్‌కేపురం,మల్కాపురం సేవా మార్గాల్లో నీరు నిలిచిపోయింది. వర్షపునీరు పోయేందుకు సర్వీసు రోడ్ల వెంబడి కాలువలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకుంటుంది. వాహనదారులు ఇబ్బందులు పడడం రివాజుగా మారిపోయింది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలకు డిమాండ్



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

మహారాణిపేట: కులం పేరుతో తిట్టి అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో సినిమా థియేటర్ ఎదుట ఆందోళన చేస్తామన్నారు. ఇప్పటికే ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు. సంఘం జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు బంగారమ్మతల్లి పండగ

రాత్రి అనుపు మహోత్సవానికి విశేషంగా ఏర్పాట్లు



బంగారమ్మతల్లి



గ్రామంలో జోగి ఊరేగిస్తున్న గుడి పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి సోదరి, అడవివరం గ్రామదేవత బంగారమ్మతల్లి వార్షిక పండగ మంగళవారం జరగనుంది. అమ్మవారి పండగను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం, గ్రామస్తులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. ప్రియాగార్డెన్స్‌లోని అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. పుష్పాలు, భారీ ఎత్తున విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు ఉచిత ప్రసాద వితరణకు సన్నాహాలు చేశారు. గ్రామసాంప్రదాయం ప్రకారం రాత్రి అనుపుమహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. పాత అడవివరంలోని బంగారమ్మ సతకంపట్టు నుంచి పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు ఘటాలను ఊరేగింపుగా ప్రియాగార్డెన్‌లోని ఆలయం వద్దకు రాత్రి తీసుకువెళ్తారు. పండగ మహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి తొలేళ్ల పండగని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి జోగిని, రాత్రి అమ్మవారి ఘటాలను గ్రామంలోపెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. తొలేళ్ల సందర్భంగా స్థానిక మార్కెట్‌లో దేవస్థానం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష, వస్త్రాలను అందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com